# ఆశాజ్యోతి

[కథానిక]

శ్రీ గోపీచంద్

నిలువుబొట్టుకుమల్లే వెలుగుతున్న దీపానికి కొడి కట్టింది. కాంతి తగ్గింది. కొడి రాలుద్దామని ఆమె దీపం దగ్గరకు వెళ్ళింది. కాని తీరా దగ్గఱకు వెళ్ళేటప్పటికి ఆమెకు భయం వేసింది. చితిలో కూర్చున్న సీతమ్మవారికిమల్లే కూర్చుని వుంది కొడి. కొడి రాలిస్తే దీపం బాగా వెలుగుతుంది. నిజమే. కాని కొడిని రాల్చే ప్రయత్నంలో దీపానికే మోసం రావచ్చు. దురాశ దుఃఖానికి చేటు. ఆమె కొడిని రాల్చలేకపోయింది. తనెవరు కొడి రాల్చడానికి? కొడిఅవసరం దీపానిది. ఆ పని దీపమే చూచుకుంటుంది. విడిపోవటమే మంచి దనుకున్నప్పుడు కొడి తనంతట తానే విడిపోతుంది. ఆ పాపాన్ని తనెందుకు వొడికట్టాలి, వున్నవి చాలక?

గీసిన అగ్గిపుల్లకోసం వెతికింది. గీసి వేసిన అగ్గిపుల్లతో వొత్తి పెద్దది చేసింది. పెరికిన తోటకూరకాడకుమల్లే వొత్తి వాలి పోయింది. కోపగించినట్లు దీపం చిటపట చిటపట మంది. ఆరిపోయిందే అనిపించింది. ఆమె గుండె గుభేలు మన్నది. ఆవురు ఆవురు మంటూ పసివాడిదగ్గరకు వెళ్ళింది. వాడికి రెండో నెల, గుండె జలుబు. మూసిన కన్ను తెరవటం లేదు. వేసిన చెయ్యి కదల్చటం లేదు. చాచిన కాలు మడవటంలేదు.

దీపం ఆరలేదు. వాడు కదల్లేదు.

ఆమెకళ్ళు చెమ్మగిల్లినై. జీవితం పామై తరుముతూ వుంది ఆమెని.

ఆమెభర్త మరణించాడు. ఈ పసివాడు కడుపున పడటం, ఆమెభర్త మరణించటం వొకేసారి జరిగినై. అప్పుడే తను ఆత్మహత్య చేసుకుందాం అనుకుంది. కాని తన కడుపులో కదిలే ప్రాణాన్ని వొదిలిపెట్టలేక పోయింది. తను ఆత్మహత్య చేసుకుందాం అనుకున్నప్పుడల్లా కడుపులో వూపిరి సలప నట్లు తన్నుకునేవాడు. తనకు జాలివేసేది. ఆ ప్రయత్నం మానుకుంది. వీడికోసమే తను బ్రతికింది.

"అమ్మా!"—మంచంమీద ఆమెకు ఎదురుగా కూర్చున్న కూతురు పలకరించింది. ఆమెకు భయంవేసింది. పలకలేక పోయింది.

"అమ్మా"—కూతురు మళ్ళీ పలకరించింది. ఆ పిల్లకు ఆరో ఏడు. పట్టిన పట్టు విడవదు. ఆమె మాట పెకలించింది- "ఏం తల్లీ?"

"చిట్టిబాబుకి జబ్బు కాదూ?"-అడిగింది కూతురు.

"అవు నమ్మా" అని, కూతురు ఇంకేమి అడుగుతుందో అని ప్రాణాలు బిగబట్టుకొని కూర్చుంది.

"నయం అవుతుందిలే అమ్మా. విచారం పెట్టుకోకు" అంది కూతురు.

ఆమెకు ప్రాణం లేచి వొచ్చింది. "నయం అవుతుందా అమ్మా?"

"తప్పకుండా నయం అవుతుంది".

"మా అమ్మే" అని పిల్లని వొళ్లోకి తీసుకుంది; గట్టిగా కావిలించుకుంది. ఆమె వొళ్లు గగుర్పొడిచింది. పాలు చేపుకి వొచ్చినై. కళ్లు నీళ్లు కమ్మినై. రవికె తడిసింది. కన్నీళ్లు వొలికినై.

"తప్పకుండా నయం అవుతుందా అమ్మా?" ఆతురతగా అడిగింది కూతుర్ని.

"ఓ"

"మా అమ్మే!" పరవశత్వంతో కళ్లు మూసుకుంది. హద్దులు సురిగినై. అంచులు కరిగినై. కొలుకులనిండా కన్నీరు. లోకమంతా జలమయం. ఆ మయంలో మర్రి ఆకు, ఆ ఆకుమీద పసిపాప. కళ్లు తెరిచేటప్పటికి మంచంలో వున్న పసివాడు శేషతల్పశాయిలా కనుపించాడు.

చలిగాలి వేసింది. గాలి తగలకుండా పసివాడికి గుడ్డ కప్పింది. బొట్టుబొట్టుగా మందు పోసింది. చంటివాడు చప్పరించాడు.

"చూశావటే అమ్మా, చిట్టిబాబు వేషాలు. ఏమీ ఎరగనట్టు కళ్లు మూసుకొని గుటుక్కున తాగివేశాడు" అన్నది కూతురు.

ఆమె చిరునవ్వు నవ్వింది. కూతురు తల నిమిరింది.

గోడనున్న గడియారం టంగుటంగున గంటలు కొట్టింది.

ఆ గడియారం తను కొత్తగా కాపరానికి వొచ్చినప్పుడు కొన్నది. ఎంత కాలం గడిచింది, ఎన్ని మార్పులు వొచ్చినై! కాని అదిమాత్రం ఒకే రకంగా తిరుగుతూ వుంది. ఉదయం ఆరుగంటలనుంచి సాయంత్రం ఆరుగంటలు, సాయంత్రం ఆరు గంటలు మొదలుకొని మళ్లీ ఉదయం ఆరుగంటలు ఈవిధంగా తిరుగుతూనే ఉంది. మార్పు లేదు. అలవాటై అనుకోటమేగానీ, జీవితంలో మార్పుకీ, కాలానికీ ఏమి సంబంధం? కాలం గడవటం అని అవసరం కొద్దీ అనుకుంటాం గాని, కాలానికి గడవటం అనేది ఎక్కడుంది? ఉన్నదేదో వుంది. అసలు కాలం అనేదే లేదు.

తన భర్తకు ఆ గడియారం అంటే చాలా ఇష్టం. నమ్మకం. దాన్ని బట్టే నడిచారు జీవితంఅంతా. ఆయన బ్రతికి వున్నంతకాలం అదికూడా ఆయనకోసమే ఆడుతున్నట్టు ఆడేది. ఇప్పుడు తనకోసమే తను ఆడుతున్నట్టు నటిస్తూ వుంది. ఎంత వంచన! ఇతరులను ఇంత వంచించి బ్రతక్కపోతే ఏమో. అది గంటలు కొట్టినప్పుడల్లా "నాకోసమే నేను ఆడుతున్నాను. నాకోసమే నేను ఆడుతున్నాను" అంటున్నట్లు వినిపిస్తుంది తనకి. తన భర్తను జ్ఞాపకం చేస్తుంది. ఆయన వొట్టి అమాయకుడు. అందర్నీ ఇట్లాగే నమ్మేవాడు. అందరికోసం తను పనిచేస్తూ వుండబట్టి. ఇప్పుడు ఏమనుకొని ఏమి ప్రయోజనం?

"ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?" అని అడిగింది కూతురు.

అందరూ తనకోసమే పనిచేస్తున్నారు అనుకునేవాడు. ఇంత మోసం ఉంటుందని ఆయనకేం తెలుసు అయినా.

"ఏమీ లేదమ్మా" అని చెప్పింది ఆమె. కాని కూతురు ఆమెమాటలు నమ్మినట్టు లేదు.

"నువ్వు కాస్సేపు పడుక్కో అమ్మా" అంది.

"నాపక్కి ఏమొచ్చిందిలే తల్లీ!"

"నిన్న కూడా నిద్దర లేదు."

"పరవాలేదులే అమ్మా"

"మాకు జబ్బుచేస్తే నువ్వు చూస్తావు. నీకు జబ్బుచేస్తే ఎవరు చూస్తా రమ్మా?"

"భగవంతుడు" అనబోయింది. కాని కూతురు "నిన్ను చూసే భగవంతుడు నన్ను మాత్రం చూడడటే" అంటుందేమోనని, ఆపుకొని "నువ్వు పడుకో అమ్మా" అన్నది. "నాకు జబ్బు చెయ్యదులే తల్లీ" అన్నది. ఈ జవాబు కూతురికి నచ్చలేదు. "చిట్టిబాబుని నేను చూస్తాగా. నువ్వు పడుకో అమ్మా" అన్నది. "వొద్దుగాని, నువ్వు వెళ్లి పడుకో".

"అబ్బ! నాకు నిద్దర రావటం లేదే" అంది కూతురు. అని మెదలకుండా కూర్చుంది. ఈలోగా ఏమి ఆలోచించిందో, కాసే పయింతరువాత మళ్లీ అందుకుంది.

"చూడమ్మా, చిట్టిబాబుకి ఇంత జబ్బు చేసిందా - మనం కాబట్టి సరిపోయింది... నాన్నగారే వుంటే—ఎంత గందరగోళపడే వారే" అన్నది.

ఆమె మాట్లాడలేదు. ఒక పెద్ద నిట్టూర్పు విడిచింది. కూతురు చెప్పింది నిజం. పిల్లలకు కొంచెం జబ్బుచేస్తే ఆయన మనిషి మనిషిగా వుండేవారు కాదు. తను కంగారు పడేవారు. తనని కంగారు పెట్టేవారు. ఇల్లంతా కంగారు కంగారు చేసేవారు. గడియ గడియకీ "నయం అవుతుందా?" అని తనని అడిగేవారు. బిక్కమొహం పెట్టుకొని దీనంగా అడిగేవారు. ఆయన్ని చూస్తే తనకు జాలి వేసేది. లాలించ బుద్ధయ్యేది.

"నయం అవుతుంది" అని చెప్పేది తను.

"తప్పకుండా నయం అవుతుందంటావా?" అని అడిగేవారు.

కాస్త అనుమానంగా చెపితే ఏమైపోతారో అని తనకు భయం వేసేది. "తప్పకుండా నయం అవుతుంది." అని చెప్పేది.

"నిజం చెప్పు" అని అడిగేవారు.

తను నిజం చెప్పాలట.

"నిజమేనండీ. తప్పకుండా నయం అవుతుంది. నామాట అబద్ధమేమో తెల్లవారేప్పటికి చూడండి. తగ్గకపోతే అప్పుడు అడగండి" అని తనతో చెప్పించుకొనిగాని వొదిలేవారు కాదు.

తనకు ఈ ఇద్దరు బిడ్డల సందునా ఒక కొడుకు పుట్టిపోయాడు, ఆరోజుల్లో ఆయన ఎంత బాధపడ్డాడు! తనకు ఆస్పత్రిలో జేరటం ఇష్టంలేదు. వాళ్లకు కాన్పు చెయ్యటం తెలుసుగాని పసికూనల్ని పెంచటం తెలియదు. ఆముదం పెట్టనివ్వరు. ఎంత చలిగాలి వీస్తున్నా సరే, తలుపులన్నీ బార్లగా తీసి ఉంచుతారు. అందుకని తనకు ఆస్పత్రికి వెళ్లటం ఇష్టంలేదు. ఆయనకు ఆస్పత్రి అంటే నమ్మకం. డాక్టరు అంటే నమ్మకం. ఆయనకోసం చేరింది. ఆ కాన్పు చాలా కష్టం అయింది.

ఆస్పత్రిలో చేరటమే మంచిదయింది అనిపించింది తనకు. కాని ఆరో రోజు పిల్లవాడుపోయాడు. ఆయనదుఃఖం ఏం చెప్పను? ఆస్పత్రిఆవరణలో ఆ పెద్ద చెట్టుక్రింద

ఒంటరిగా దిగాలుపడి నుంచున్న ఆయన్ను చూస్తే కడుపు తరుక్కుపోయింది. తను ధైర్యం చెప్పి ఇంటికి తీసుకురావలసివచ్చింది.

"ఆస్పత్రికి వెళ్లకుండా వుంటే బ్రతికే వాడేమో". అన్నారు. వెళ్లటమే మంచిది అయిం దని తాను ఎంతో సర్ది చెప్పింది. కాని ఆయనమనస్సుకి కలిగిన గాయం మాన్పలేకపోయింది.

"ఇటువంటివన్నీ మనకే జరుగుత య్యెందుకనో?" అన్నారు.

"మనకే ఎందుకు జరుగుతయ్యి లెండి. మన కష్టాలు గనక మనకు తెలుస్తున్నయ్యి" అన్నది తను. తన ప్రవర్తన ఆయనకు ఆశ్చర్యం కలిగించింది. ఇంత మొండి మనస్సేమో అనుకున్నారో ఏమో. పాపం, ఆయన కేం తెలుసు తన బాధ. మనస్సులో తను పడిన బాధ ఆయన చూచి ఉంటేనా?

... ... ...

దీపం వెలుగుతూ వుంది. కొడి పెరుగుతూ వుంది. దీపం తన్ను తాను హరించు కొంటూ లోకానికి వెలుగు నిస్తూ వుంది. కొడి తాను పెరుగుతూ కాంతిని తగ్గిస్తూ వుంది. కొడిస్వభావం దీపానికి తెలుసు. కాని దాన్ని సృష్టించుకోకుండా ఊరుకోదు. ఆ సృష్టివల్ల తనకు ప్రాణాపాయం కలిగినా సరే. ఎదుగూబొదుగూ లేకుండా చిరకాలం బ్రతికిందానికంటే కదులుతూ, వెలుగుతూ ఆనందంగా ఒక్కక్షణం బ్రతికినా చాలు. అందుకు తన్ను తాను కాల్చుకుంటుంది. కొడి కట్టించుకుంటుంది. ప్రాణంమీదకు తెచ్చుకుంటుంది. జీవితం క్షణభంగురం చేసుకుంటుంది.

దీపం కుంకుమబొట్టు అయింది.

వొత్తికి నూనె అందటం లేదు అనుకుంది ఆమె. లేచి పాదుల్లో నీళ్లు పోసినట్లు ప్రమి దెలో నూనె పోసింది. మెదలకుండా వెళ్లి పసివాడిదగ్గర కూర్చుంది. వాళ్లో మార్పు కనిపించింది. కదిలాడు. ఒక్క కదలటమేనా? గుప్పెట మూస్తున్నాడు, తెరుస్తున్నాడు. ఆమె చూచింది. "చూశావా అమ్మా, బాబు ఏం చేస్తున్నాడో" అన్నది కూతురుతో సంతోషం పట్టలేక.

"ఆడుకుంటున్నాడే" అన్నది కూతురు.

తల్లి పసివానిచెయ్యి నిమురుతూ కూర్చుంది. ఆమెచూపుడువేలు తన గుప్పెట్లో పట్టుకున్నాడు పసివాడు. వొద లడు. ఆమెకి వొదిలించుకోవాలని లేదు. అలాగే కూర్చుంది.

పసివాడు వున్నట్లు వుండి కళ్లు తెరి చాడు. ఎంత తెలివిగా చూశాడని! తల్లిని గుర్తుపట్టినట్టే చూశాడు. యుగయుగాల నుంచీ ఆమెకోసం వెతుకుతున్నట్టూ, నేటికి వాడి కోర్కె తీరినట్లూ చూశాడు. తను కళ్లు తెరిచింది ఆమెను చూట్టానికే అన్నట్లు చూశాడు. ఆమె కంట పడగానే వాడి కళ్లు మిలమిలా మెరిసినై. తమలో తాము నవ్వుకున్నై.

"ఏరా నాతండ్రీ! ఏమిట్రా? దేన్ని చూచు కొనిరా ఈ మురిపెం?" అని అడిగింది ఆమె.

"అమ్మరా" అని జ్ఞాపకం చేసింది వాడి అక్క. వాడు కులికాడు. ఆ కులుకులో అమ్మచెయ్యి వొదిలాడు. గుప్పెట మొహాని కేసి రుద్దుకున్నాడు.

'ఛీ, ఛీ, ఛీ, ఛీ' అని వాణ్ణి నవ్వించ టానికి ప్రయత్నించింది వాళ్ల అక్క.

నిజంగా వాడు నవ్వాడు. ఆ నవ్వుకి ధ్వని

లేదు. వాడు బయటికి నవ్వలేదు. లోపలే నవ్వుకున్నాడు. మబ్బు పట్టి ఉరమకుండా తేలిపోయినట్టు వుంది వాడి నవ్వు. లోపల నవ్వుకున్న ఆ నవ్వుకి వాడి వొళ్లంతా నవ్వింది. డొక్కలు ఎగరవేశాడు. ఉండేలు బద్దకుమల్లే పైకి లేచాడు ఊ అంటూ.

"ఊరుకోరా తండ్రీ. పడుకో" అని బ్రతిమాలింది తల్లి.

"చూశావా అమ్మా, నామాట నమ్మక పోతివే" అంది కూతురు.

"ఏమిటి తల్లీ?

"బాబుకి నయం అయింది."

ఆమెవొళ్లు ఝల్లుమన్నది. నిరాశా రంగా వొళ్లంతా వ్యాపించివున్న ఆమె భయానికి ఆకారం ఏర్పడింది.

"నయం అవుతుందా తల్లీ?" గద్గద స్వరంతో అడిగింది.

'ఓ' అన్నది కూతురు.

"తప్పకుండా నయం అవుతుందా ?"

"తప్పకుండా నయం అవుతుందే."

"నిజంగానా ?" అని అడగబోయింది. మాట నోటిదాకా వచ్చింది. భర్త జ్ఞాపకం వొచ్చాడు. ఆయన తన్నీవిధంగానే అడిగే వారు. ఆమెకు లజ్జ కలిగింది. శరీరం రస వాహినిగా మారింది.

భర్త కనిపించాడు.

ఆమె కొత్త పెళ్లికూతు రైంది.

"కులాసాగా వున్నావా ?" అని అడిగాడు.

"మీకు తెలియదూ ?"

"తెలుసు."

"అవిటి బ్రతుకైంది అన్నిటికీ."

"అలా అనుకోకు."

"దేనిమీద ఆశ పెట్టుకొని అనుకోకుండా వుండేది ?"

"నేను చెప్పింది మరచిపోయావా ?"

"ఏమిటి ?"

"కష్టమనీ సుఖమనీ, చావనీ బ్రతుకనీ— ఇవన్నీ పెట్టుకోగూడదు. ఈ ప్రపంచంలో ఒక మనిషి కష్టపడటం, సుఖపడటం, పుట్టడం చావటం ఇవేవీ చెప్పుకో తగ్గ విషయాలు కాదు. అంటీ అంటకుండా బ్రతకటమే జీవితాన్ని జయించటం."

"అవును."

"ఏమిటి అవును?"

"జ్ఞాపకం వుంది."

"జ్ఞాపకం వుందంటే చాలదు. నీవు జ్ఞాపకం వుంచుకునేదానివీ, అది జ్ఞాపకం వుండేదీ — ఈ భేదం వున్నంతకాలం చిక్కే. నీవే జ్ఞాపకం, జ్ఞాపకమే నువ్వు కావాలి."

"నేనే జ్ఞాపకం. జ్ఞాపకమే నేను."

అతను అంతర్ధానం అయ్యాడు. రస వాహిని శరీరంగా మారింది. దీపం గుప్పుమంది. కాని ఆరలేదు. కొడి పెరిగింది. కాని విరగలేదు. ఆమె చూచింది. కాని దృష్టి నిలవలేదు. అదొక దీపం. దాని కొక వొత్తి. వొత్తి కొక కొడి. ఇదొక మంచం. దాని మీద గుడ్డలు. గుడ్డల్లో పసివాడు. వాడికి జబ్బు. ఎదురుగా కూతురు. కూతురుకి ఎదురుగా తను, ఇల్లా దేనికి దాన్ని చూడలేక పోయింది. ఇవన్నీ కలిస్తే ఏమవుతుందో అదే జీవితం అనిపించింది. అదేదో ఒకటి వుంది అనిపించింది...

కూతురు కునుకుతూ వుంది.

"తల్లీ!" తల్లి లేపింది.

కూతురు బరువుగా రెప్పలు తెరిచింది.

"పడుకో అమ్మా. నిద్దర కాయలేవు."

కూతురు కళ్లు నులుపుకొని 'కాస్తేనే' అంది.

"వినమ్మా, బబ్బు చేస్తుంది."

"మరి నీకో?"

"నేను పెద్దదాన్ని."

"నేను మాత్రం పెద్దదాన్ని కాదటే. చూడు, బాబు కంటే ఎంత పెద్దనో" అని మంచంమీదనుంచి లేచి నుంచుంది.

"పెద్దతనం అంటే అదికాదు తల్లీ."

"మరింకేమిటి?"

"నువ్వు నిజంగా పెద్దదానివైతే అప్పుడు తెలుస్తుంది."

కూతురు మాట మార్చింది. "బాబు ఎంచక్కా నిద్దరపోతున్నాడే." అన్నది.

"వాడికి వాళ్ల నాన్న గుణం వొచ్చింది."

"నాకో?"

"అమ్మగుణం."

కూతురికి పడుకో బుద్ధయింది.

తల్లికి అర్థం అయింది.

తనలో తాను నవ్వుకుంది. నా తల్లిదీ వాళ్ల నాన్నగుణమే అనుకుంది.

కూతురు పడుకుంది. శాలువా కప్పుకుంది. మధ్యలో ఏమి జ్ఞాపకం వొచ్చిందో నేను అన్నట్టే అయింది. "చిట్టిబాబుకి నయం అవుతుంది" అన్నాను. అయింది. "రేపు నాబాబుకి నేనే నీళ్లుపోస్తా, కాళ్లమీద పడుకోబెట్టుకొని. రేపు నాకు సున్నిఉండలు చేసిపెట్టవటే?"

మాట్లాడుతూ మాట్లాడుతూనే నిద్రపోయింది. పిల్లల పని అంతే.

ఆమె పసివాడికి కప్పినగుడ్డ సర్దింది.

వొంటిమీద చెయ్యి వేసి చూసింది. బుగ్గలు నిమిరింది. ఆలోచనలో పడింది. తన తండ్రి..తన తల్లి...తన అన్నలు. అన్నల పెళ్లిళ్లయి తన పెళ్లి కాకముందే తండ్రి మరణించాడు. తండ్రి గతించగానే అన్నలు వేర్లు పడ్డారు. వాళ్ల జీవితాలు వేరైనై. తల్లినీ, తననీ పరాయివాళ్లని చూచినట్లు చూసేవారు. తన తల్లి తనమీద ఆశ పెట్టుకొని జీవించింది. తనని ఒకాయన చేతుల్లో పెట్టి తప్పుకుంటా ననేది. తనకు వివాహం అయింది. అప్పటినుంచీ తన కడుపున ఒక కాయ పడితే చూడా లని ఆశపడేది. అంత కంటే ఇక ఏ కోరికా లే దనేది. తనకు కూతురు కలిగింది. మలిచూలు మగబిడ్డ అని ఆశపడేది. మనమరాలిపెళ్లి చూడాలని ఆశపడేది. అంతకంటే ఏకోరికా లే దనేది. కాని అప్పటిదాకా వుంటే మునిమనుమణ్ణి చూడాలని తప్పకుండా ఆశపడేది. ఆశకు అంతు లేదు. జీవితానికి పునాదే ఆశ. జీవించటం అంటేనే ఆశపడటం. ఆ జ్యోతి సర్వకాలసర్వావస్థలయందూ వెలుగుతూనే వుంటుంది. తన భర్త అంటూవుండేవాడు. దేనికోసం బ్రతకటం అనే ప్రశ్న అర్థం లేని ప్రశ్న. బ్రతకటమే ఆనందం.

కొండి రాలింది. దీపం మెరిసింది. మెరవటంలో కొలనులోని కలువపువ్వులా మెరిసింది. భళ్లున తెల్లవారింది.

---